www.prajasakti.com
# ప్రజాశక్తి
మంగళవారం 26 సెప్టెంబర్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



### డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

**నెల్లూరు :** డిగ్రీ సెకండ్, ఫోర్త్ సెమ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెల్లడించకుండా ఫైనల్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు నష్టపోతారని, ఈ నేపథ్యంలో తక్షణమే ఫలితాలు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమానికి హాజరైన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో విక్రమ సింహపురి పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలకు ఫైనల్ ఇయర్ అక్టోబర్ 17 నుండి ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నామని యూనివర్సిటీ అధికారులు ప్రకటించారని, దీనివలన విద్యార్థులు నష్ట పోతారన్నారు. డిగ్రీ లో సెకండ్, ఫోర్త్, సెమ్ సప్లిమెంటరీ ఎగ్జామ్స్ రిజల్ట్ ఇవ్వకుండానే డైరెక్ట్ గా ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సెమ్ ఎగ్జామ్స్ నిర్వహించడం వల్ల చాలామంది విద్యార్థులు ఏడాది పాటు పరీక్షలు రాసే దుకు కష్టమవుతుందని తెలిపారు. అక్టోబర్ 5 వరకు పరీక్ష తేదీని పొడిగించి పరీక్షలు అక్టోబర్ 17 తేదీ నుండి జరిగే పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ నెల్లూరు నగర కార్యదర్శి వి,నరేంద్ర, సురేష్ ను పాల్గొన్నారు.

నెల్లూరు చేరిన

## యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల జాతా

### జెండా ఆవిష్కరించిన మాజీ ఎంఎల్‌సి 'విటపు'

నెల్లూరులో జెండా ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

**ప్రజాశక్తి-నెల్లూరు:** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జెండాను ఇంత ఉన్నతంగా నిలబెట్టేందుకు జీవితాలను అంకితం చేసిన అనేక మంది మహానుభావులున్నారని, వారి అడుగులో అడుగులు వేస్తూ .. వారి దారిలో పయనిస్తూ ముందుకు సాగాలని మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రహ్మణ్యం పిలుపు నిచ్చారు. ఈ నెల 21వ తేదిన హిందూపురం వద్ద ప్రారంభమైన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల ప్రచార జాత సోమవారం నగరానికి చేరుకుంది. సోమవారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి 5వ రోజు ప్రచార ప్రారంభమైంది. యుటిఎఫ్ జెండాను మాజీ ఎంఎల్‌సి విటపు బాల సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. యుటిఎఫ్ లోగోను ప్రజా నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.వి.శేషులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విటపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చాలా భావోద్వేగంతో కూడుకున్నటువంటి సందర్భం ఇది అన్నారు. దేశ, రాష్ట్ర చరిత్రలో 50 ఏళ్ల అంటే చాలా విలువైన, సుదీర్ఘమైన కాలమన్నారు. అటువంటిది రాష్ట్రంలో ఒక ఉపాధ్యాయ సంఘం 50 ఏళ్ల ప్రస్థానాన్ని కొనసాగించిందన్నారు. ఈ విలువైన కాలంలో ఎంత మంది దీని కోసం సర్వం త్యాగం చేశారో గుర్తు చేసుకోవాల్సిన అవసర ముందన్నారు. చిన్నపాటి లక్ష్యం అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలోనే ఉంటూ, తన ఆరోగ్యం కోసం సంఘం సొమ్ము ఖర్చు పెట్టాలని, కొందరు ప్రతిపాదన తీసుకొచ్చా రన్నారు. ఆ ప్రతిపాదనలను తన ఆరోగ్యం కోసం ఒక్క రూపాయి కూడా సంఘం డబ్బులు ఖర్చు చేసేందుకు వీల్లేదని ప్రకటించి కన్నుమూశారని గుర్తు చేశారు. అటువంటి నాయకుల వారసత్వం తమ సంఘానిదని తెలిపారు. రామిరెడ్డి తీవ్ర అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్సలు తీసుకుంటున్న సమయంలో తనకున్న ఏకైక ఇళ్ల స్థలాన్ని అప్పటికప్పుడు అమ్మి ఆ నగదును జిల్లా యుటిఎఫ్ సంఘానికి జమచేసిన వారసత్వం ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్‌కే దక్కుతుందన్నారు. ఏ త్యాగాలు లేకుండా, ఎటువంటి ఎదురీతలు లేకుండా, ఏ సవాళ్లను అధిగమించకుండా, ఎవరూ బలిదానాలు చేయకుండా 50 ఏళ్ల ప్రయాణం సాగదన్నారు. ఈ 50 ఏళ్ల తర్వాత కూడా ఎలా కొనసాగించాలన్నది నిరంతరం ముందు ఉన్న విషయమన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాల ట్రేడ్ యూనియన్ల పట్ల సదాభిప్రాయం లేనటువంటి దుర్మార్గమైన పాలన సాగిస్తున్నాయన్నారు. వీటిని ఎదిరించి జెండా పట్టుకొని పోరాటం చేయడం అనేటువంటిది, సగటు ఉపాధ్యాయులను యుటిఎఫ్ సంఘంలో నడుపుకోవడం వంటిది, మనం చేయాల్సిన ప్రయాణమన్నారు. 50 ఏళ్ల పోరాటంలో తాను పాల్గొన్నప్పటికీ 50 ఏళ్ల దాటిన సందర్భంలో మళ్లీ తాను పాల్గొనే మాటల్లే అవకాశం వస్తే తాను రావడం తన జీవితంలో మరువలేనిదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ చేసినటువంటి కృషి ఎనలేనిదన్నారు. ఎంతో మంది ప్రముఖులు తమ జీతాలను, జీవితాలను త్యాగం చేసి యుటిఎఫ్ సంఘాన్ని, జెండాను 50వ సంవత్సరానికి నడిపిన ప్రతి ఒక్కరికి జేజేలు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి.బాబురెడ్డి , యుటిఎఫ్ నాయకులు పలువురు ప్రసంగించారు. అనంతరం యుటిఎఫ్ జాతా నగరంలోని జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభించి మినిబైపాస్ రోడ్డులో పూలే విగ్రహం వద్ద పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా సాగిన ఈ జాత ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సాలుచింతల ప్రాంతాల మీదుగా బుచ్చిరెడ్డి పాళెం వరకు సాగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ, సీనియర్ నాయకులు కొండారావు, మస్తానయ్య, జివి భాస్కర్, టి.గోపాల్, ఎన్.వి.సుబ్బారావు, కె.వరదామయ్య, సిహెచ్ శ్రీహరి, శివప్రసాద్, భారత్‌బాషా, ఎం.సి అచ్చయ్య, కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**గుడ్లూరు :** ప్రభుత్వ పాఠశాల విద్యను కాపాడుకోవాల్సిన అవసరముందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, కార్యదర్శి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అక్టోబర్ ఒకటి నుంచి విజయవాడలో జరుగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సన్నాహక సభ జయప్రదం చేయాలని కావలి నుంచి గుడ్లూరు వచ్చిన యుటిఎఫ్ ప్రచార జాతాకు కె గుడ్లూరులో ఉపాధ్యాయులు ఘన స్వాగతం సోమవారం పలికారు.స్థానిక ఎంఆర్సి కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను కాపాడుకోవడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. మండల యుటిఎఫ్ నాయకులు 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్లూరులో..

## 'స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

**ప్రజాశక్తి-నెల్లూరు :**జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి అందే అర్జీలు మళ్లీ మళ్లీ పునరావతం కాకుండా సంతప్తికరస్థాయిలో సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, తెలుగు గంగ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ చిన్న ఓబులేసుతో కలిసి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల జిల్లా అధికారులు జగనన్న కు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. డిఆర్డిఏ పిడి సాంబశివారెడ్డి, డియంహెచ్‌ఓ పెంచలయ్య, డిపిఓ సుస్మిత, హౌసింగ్ పీడీ నాగరాజు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు , జిల్లా అధికారులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న విజయ్‌బాబు

## తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు

**ప్రజాశక్తి-నెల్లూరు :**తిక్కన, నన్నయ్య, పోతన లాంటి మహానుభావులు అందించిన తెలుగు భాషా వారసత్వాన్ని కొనసాగిస్తూ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని రాష్ట్ర అధికార భాషా సంఘం మరియు తెలుగు భాషాభివద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు అధ్యక్ష్యులు పి. విజయబాబు, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖలలో అధికార భాషగా తెలుగు అమలు తీరుపై రాష్ట్ర అధికార భాషా సంఘం మరియు తెలుగు భాషాభివద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు అధ్యక్ష్యులు పి. విజయబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ తో కలిసి సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యులు డా. డి. మస్తానమ్మ, డా. టి. వెంకటయ్య, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై నిర్బంధం దారుణం

### సిపిఎం జిల్లా కమిటీ ఖండన

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-నెల్లూరు**

అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో నిర్వహిం చతలపెట్టి ధర్నాను వైసిపి ప్రభుత్వం విఫలం చేసేందుకు పోలీసు నిర్బంధాన్ని, అరెస్టులను ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేసేందుకు వెళ్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్బంధం ప్రకటిం చడం అప్రజాస్వామికమన్నారు. శాంతి యుతంగా ధర్నాకు ప్రయత్నిస్తుంటే హింస జరుగుతుందని పోలీసులే తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ధర్నాలో పాల్గొనేందుకు రైలు, రోడ్డు మార్గంలో వెళ్ళిన అంగన్‌వాడీలను విజయవాడ శివారు ప్రాంతంలోనే పోలీసులు అడ్డుకోని అక్రమంగా నిర్బందించడం దారుణ మన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ ను అనుసరించి సెక్షన్ 143, 290,188, ఆర్ డబ్ల్యూ 149, సెక్షన్ 39, తదితర సెక్షన్ల క్రింద పోలీసు కేసులు నమోదు చేయడం హేయమన్నారు. ధర్నాకు అనుమతివ్వకపోవడం నిరంకుశమని, అప్రజాస్వామికమని విమర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, తమ సమస్యల పరిష్కారం కోసం కొంతకాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు చేస్తున్నారని, కలెక్టరేట్ల వద్ద వేలాది మందితో ధర్నాలు, ప్రదర్శనలు చేశారని గుర్తు చేశారు.ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తుందన్నారు. జిల్లాల్లో అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, తుళ్లూరు గోపాల్, గోగుల శ్రీనివాసులు, గుంజి దయాకర్, ముత్యాల గుర్నాదం, సిఐటియు నాయకులు కె. అజయ్‌కుమార్, రైతు సంఘం నాయకులు మూలివెంగయ్య ఉన్నారు.

**అంగన్‌వాడీల అరెస్టుకు ఖండన**

**కందుకూరు :**తమ సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో శాంతి యుతంగా మహాధర్నా చేయడానికి ప్రయత్నిస్తున్నవారిని ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్ పేర్కొన్నారు. వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు, తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వం హామీలిచ్చి మాట తప్పిందని విమర్శించారు.

## 'టిఆర్‌ఆర్'లో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

**కందుకూరు :**టిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవం సోమవారం ఎ జరిగింది. కళాశాలలో రెండు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు పనిచేస్తున్నాయి.కళాశాల ప్రిన్సిపల్ ఎం రవి కుమార్ , వైస్ ప్రిన్సిపల్ ఏడుకొండలు ,నరేంద్ర విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ యొక్క ఆవశ్యకతను గురించి వివరించారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ సిహెచ్ శంకర్ రావు నరేష్ రాజా కార్యక్రమాలు ఆవశ్యకత గురించి వివరించారు. డాక్టర్ పి. రాజగోపాల్, డాక్టర్ కె. సుజాత ,షేక్ షహనాజ్ బేగం, కె కే పద్మావతి, జె.మైత్రి, కె.కరుణ కుమార్ తదితర అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు తమ సందేశాన్ని అందించారు. సామాజిక సేవ లో యువత యొక్క పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## పాదయాత్రను జయప్రదం చేయండి : సిపిఎం

**ప్రజాశక్తి-కందుకూరు :**ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ రామాయపట్నం వద్ద నుంచి నెల్లూరు వరకు సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 13వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు సిపిఎం వలేటివారిపాలెం మండల ఇన్‌ఛార్జి జివిబి కుమార్ పేర్కొన్నారు. సోమవారం వలేటివారిపాలెంలోని ప్రగతి స్కూల్ వద్ద సిపిఎం వలేటివారి పాలెం మండల సమావేశం ఆ పార్టీ మండల నాయకులు సాధు.చెన్న కేశవులు అధ్యక్షత న జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు జీవీబీకుమార్ పాల్గొని మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించి అవకా శవాద రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నాయని విమర్శించారు. సిపిఎం మండల నాయకులు దువ్వూరి జాన్, పివి రామారావు, పత్రి భాస్కరరావు, నేలకూరి వెంకటేశ్వర్లు,మంగి ఆశీర్వాదం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

## సిఎంను కలిసిన 'తూమాటి'

**ప్రజాశక్తి-కందుకూరు :** శాసనసభ , శాసన మండలి సమావేశాల సందర్భంగా సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని ఎంఎల్‌సి తూమాటి మాధవరావు సోమవారం మర్యాద పూర్వ కంగా కలిశారు. ముఖ్యమంత్రితో కందుకూరు నియోజక వర్గంలోని అభివద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలపె చర్చించారు.

సిఎంతో మాట్లాడుతున్న తూమాటి

## జగనన్న బీమా నమోదు

**ప్రజాశక్తి-కందుకూరు :** కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం - 1 జనార్దన కాలనీ లో జరిగిన గహ సారథులు బీమా నమోదు ప్రక్రియ సోమవారం జరిగింది. కార్యకర్తల సంక్షేమం కోసమే జగనన్న బీమా నమోదు చేయడం జరుగుతుంది అని జె సి యస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ అన్నారు. రాష్ట్రంలో క్రియాశీలక పాత్ర పోషించిన కార్యకర్తలు గహ సారథులు కుటుంబాలకు భరోసా జగనన్న ఇస్తున్నారన్నారు. సచివాలయం కన్వీనర్ షేక్ మస్తాన్ వలీ గహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రకాశం' ఎన్‌సిసి విద్యార్థులకు ప్రశంసలు

**ప్రజాశక్తి-కందుకూరు :** కొత్తపట్నం బీచ్‌లో ఆదివారం జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశం ఎన్‌సిసి విద్యార్థులు విధుల నిర్వహణలో అధికారులు ప్రశంసలు అందుకోవడం హర్షనీయమని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. 38 బెటాలియన్ ఆదేశాల మేరకు తమ విద్యార్థులు ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ విధుల నిర్వహణలో పోలీస్ అధికారులు సూచనలను విధిగా పాటించి అధికారుల ప్రశం సలందుకున్నారు. నిమజ్జనానికి తల్లిదండ్రులతో సరదాగా వచ్చిన పిల్లలకు రక్షణ నివ్వడంలోనూ, ట్రాఫిక్ ను నియంత్రి ంచడంలో విద్యార్థులు విద్యార్థినులు పోటాపోటీగా పనిచేసినట్లు బెటాలి యన్ అధికారులు సైతం మెచ్చుకున్నారని ప్రకాశం ఎన్‌సిసి అధికారి హిమాంష, సహాయ అధికారి సంతోష్ వెల్లడించారు. ట్రాఫిక్ నియంత్రణ తీరంలో ప్రమాదకర స్థాయికి ప్రజలు వెళ్లకుండా విజిల్స్ ద్వారా హెచ్చరించడానికి తమ ట్రూప్ ను విభజించారని సీనియర్ ఎన్‌సిసి క్యాడేట్ సునీల్ వెల్లడించారు. 13 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని పర్య వేక్షకులు మీరావలి వెల్లడించారు.

## ఉచిత వైద్య శిబిరం

**ఉలవపాడు** :ఉలవపాడు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేటి నుంచి 26.27. 28. 29 తేదీల్లో నాలుగు రోజులపాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భవ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఉలవపాడు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్.ఎం ఐశ్వర్య తెలిపారు. ఆమె ఇక్కడ మాట్లాడారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## త్వరలో దక్షిణాంధ్ర భాషా ప్రాంతీయ సదస్సు

### రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షులు విజయ్‌బాబు

మాట్లాడుతున్న విజయ్‌బాబు, కొమ్మినేని శ్రీనివాసరావు

**ప్రజాశక్తి-నెల్లూరు :**తెలుగు భాష పరిపుష్టికి త్వరలో నెల్లూరులో దక్షిణాంధ్ర భాషా ప్రాంతీయ సదస్సు నిర్వహిం చనున్నట్లుగా రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షులు, రాష్ట్ర తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి విజయ్‌బాబు తెలిపారు. సోమవారం నగరంలోని రహదారులు, భవనముల అతిథి గహంలో రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ డి మస్తానమ్మ, డాక్టర్ టి వెంకటయ్య లతో కలసి అధ్యక్షులు విజయ్ బాబు తెలుగు సాహిత్యాభిలాష గల ప్రముఖులతో ఇష్టా గోష్ఠి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషాభివద్ధికి అత్యధిక ప్రాధాన్యమిస్తుందని, అందు కనుగుణంగానే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో భాషా సదస్సులు, రచయితలను ప్రోత్సహించటం, శోభాయాత్రలను నిర్వహించడం వంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహి స్తున్నామ న్నారు. ప్రాచీన సాహిత్యం తిక్కన కవితా ప్రాశ్చత్యం, ఆధునిక సాహిత్యం వంటి అంశాలపై సదస్సులు ఉంటా యన్నారు. ఈ ఇష్టాగోష్ఠి సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి శివకుమార్, సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి రామకష్ణ, రిటైర్డ్ ప్రొఫెసర్ బి రాజేంద్ర సింగ్, డా టి వెంకటయ్య పాల్గొన్నారు.

**తెలుగు భాషలో వ్యాపార, వాణిజ్య బోర్డులు**

వ్యాపార, వాణిజ్య భవనాలపై తెలుగు భాషలో బోర్డులు అమలు చేయని పక్షంలో రూ.10 వేల నుంచి రూ. 60 వేల వరకు అపరాధ రుసుం విధిస్తామని రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి. విజయ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రహదారులు, భవనాల అతిధి గహంలో రాష్ట్ర అధికార భాషా సంఘం తెలుగు భాషాభివద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి. విజయబాబు, సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీని వాసరావుతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలుగు భాష అమలు తీరు, ఎంత శాతం అమలు అవుతుంది, అందులో ఎదురౌతున్న ఇబ్బందులు , తెలుగు భాష అమలుకు ఇంకా ఏమి చర్యలు తీసుకోవాలన్న విషయాలపై జిల్లాల వారీగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంప్యూటరీకరణ తర్వాత తెలుగు భాష అమలులో సాంకేతికంగా వస్తున్న ఇబ్బందులు, సమస్యలను ఎలా అధికమించాలన్న దానిపై కూడా రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివద్ధి ప్రాధికార సంస్థ దష్టి సారించాయన్నారు.

**వ్యవస్థలను గాడిలో పెట్టేలా రచనలు**

సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో మీడియా అకాడమీ పలు కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. పాత్రికేయులు వ్యాసాలు , రచనలు, కవితలు, జర్నల్స్, రచించాలని, గ్రంథాలయ సంస్థల సహకారంతో వాటిని పుస్తకాల రూపంలో ప్రచురించి ప్రజలకు అందు బాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుం టామన్నారు. నార్ల వెంకటేశ్వరరావు, కాసి నాధుని నాగేశ్వరరావు వంటి సుప్రసిద్ధులైన జర్నలిష్టుల జీవిత చరిత్రను పుస్తకం రూపంలో ప్రచురించి నవంబర్‌లో ఆవిష్కరించేలా మీడియా అకాడమీ ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. వ్యవస్థలను గాడిలో పెట్టేలా, ప్రజలకు వాస్తవాలు చేపడంలో పాత్రికేయులు తమవంతు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ డి మస్తానమ్మ, డా టి వెంకటయ్య పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లోనూ జిల్లా పరిషత్ అగ్రస్థానం

**నెల్లూరు :**ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లా పరిషత్‌ను అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తూ జిల్లా ప్రజాపరిషత్ చైర్ పర్సన్ గా రెండేళ్ల పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు జెడ్‌పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో రెండేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా పరిషత్ ఉద్యోగులు ఏర్పాటుచేసిన ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ఆనం అరుణమ్మ, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రూరల్ జడ్పిటిసిగా గెలుపొందిన తనకు జిల్లా పరిషత్ చైర్మన్ గా పనిచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి, జెడ్పిటిసి సభ్యులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.అనంతరం జెడ్‌పి చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, విజయ్ కుమార్ రెడ్డి దంపతులను జడ్పిటిసి సభ్యులు, జిల్లా పరిషత్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ సిఇఒ చిరంజీవి, వైస్ చైర్పర్సన్లు శ్రీహరికోట జయ లక్ష్మమ్మ, చిగురుపాటి లక్ష్మీ ప్రసన్న, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ లు రంగవర ప్రసాద్, అశోక్ కుమార్, డ్వామా పిడి వెంకట్రావు, జడ్పిటిసి, ఎంపీపీ సభ్యులు, జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ అరుణమ్మ

## కామాక్షినగర్‌లో ఉద్రిక్తత

**తోటపల్లిగూడూరు :** మండలంలోని తోటపల్లి పంయాతి మజారా కామాక్షినగర్‌కు చెందిన ఈదూరు సింహాద్రి అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన ఎంబేటీ శివయ్య, మురళి అనే వారిపై ఈనెల 24వ తేదీన రాత్రి కత్తితో దాడి చేసి గాయ పరిచిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో ఆగ్రహం చెందిన బాధితుల బంధువులు, గ్రామస్తులు సోమవారం నిందితుడు సింహాద్రి ఇంటిని ధ్వంసం చేశారు. దీంతో కామాక్షినగర్‌లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసు కొంటా యోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కత్తితో దాడికి పాల్పడ్డ నిందితుడు సింహాద్రిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ జంపాని కుమార్ సోమ వారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ మేరకు నిందితుడు సింహాద్రిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**ప్రజాశక్తి-నెల్లూరు :**ఫ్యాఫ్టో రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా ఫ్యాఫ్టో, ఎఫ్‌ఒఆర్‌టిఒ, ఎపిసిపిఎస్‌ఈఎ, ఎపిసిపిఎస్‌యుఎస్ సంఘాలు సంయుక్తంగా నగరంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఫ్యాఫ్టో జిల్లా చైర్మన్ ఎ.సురేంద్ర రెడ్డి అధ్యక్షతన,సెక్రటరీ జనరల్ చిట్టేటి రమేష్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. చైర్మన్ సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఉద్యోగ, ఉపాద్యాయులకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందన్నారు. ఎటువంటి భరోసా లేని, ఈ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యా యులు అందరూ వ్యతిరేఖకిస్తున్నప్పటికీ ఉద్యోగుల పై బలవంతంగా జిపిఎస్ విధానాన్ని రుద్దాలని ప్రయత్నిస్తుం దన్నారు. జిల్లా సెక్రటరీ జనరల్ చిట్టేటి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం జిపియస్ ను ఆర్డినెన్స్ ద్వారా చట్టం చేసి బలవంతంగా అమలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర పరిశీలకులు యస్ చిరంజీవి మాట్లా డుతూ ఈ ప్రభుత్వం ఉద్యోగులకు అన్ని రివర్స్ విధానాలు తీసుకు వచ్చి ఉద్యోగుల మనో భావాలను దెబ్బతీస్తుందని, ఇప్పటికైన ప్రభుత్వం జిపిఎస్ విధానాన్ని విరమించుకోని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పరిశీలకులు యన్.వి. రమణయ్య మాట్లాడారు. అనంతరం ఫ్యాఫ్టో జిల్లా నాయకులు జాయింట్ కలెక్టర్ కూర్మనాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా ఫ్యాఫ్టో నాయకులు, జి.రాజమనోహర్, సి.హెచ్.హాజరత్,బొచ్చు డెవిడ్ చినబాబు,ఇ.ధన రాజ్, అచ్చయ్య, దశరథరాములు, పిచ్చి బాబు,వేణుగోపాల్, మాల్యాద్రి, కష్ణారెడ్డి, ప్రసాద్, పెంచలయ్య, శివరామి రెడ్డి, సుబ్బారావు,ఖాజా రహంతుల్లా పాల్గొన్నారు.

## చంద్రబాబుకు మద్దతుగా కొనసాగుతున్న దీక్షలు

కందుకూరులో దీక్ష చేస్తున్న తెలుగు మహిళలు

**ప్రజాశక్తి-కందుకూరు :** చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ, కందుకూరు మహిళలు కదం తొక్కారు. నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన వందలాదిమంది మహిళలు, చంద్రబాబుకి మద్దతుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. చంద్రన్నకు అండగా మేమున్నాం, సైకో జగన్‌ను తరిమికొడతాం.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నల్లబెలూన్లు చేతబట్టి, నిరసన వ్యక్తం చేశారు. చంద్రబా బు నాయుడు అరెస్టును ఖండిస్తూ టిడిపి చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 13వ రోజుకు చేరాయి. సోమవారం నియోజవర్గ తెలుగు మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇంటూరి నాగేశ్వరరావు గారి తో పాటు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం , నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు దివి సౌభాగ్య, పార్టీ నేతలు, మహిళలంతా సోమేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. చంద్రబాబు నిర్దోషిగా బయటకు రావాలని కోరుకుంటూ, 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం, అక్కడి నుంచి పామూరు రోడ్డు లోని పార్టీ ఆఫీసు వరకు ర్యాలీ కొనసాగించారు.. దీక్షల ముగింపు సందర్భంగా ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. స్కిల్ డెవలప్మెంట్ కేసు విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కళ్ళుండి కూడా గుడ్డివాడిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దివి శివరాం గారు మాట్లాడుతూ చంద్రబాబు అభివద్ధి, సంక్షేమం, ప్రజల బాగోగులు తప్ప మరేవి ఆలోచించరన్నారు. మీకు తోడుగా మేమున్నాం.. అంటూ దీక్షలో పాల్గొన్న వారందరూ చంద్రబాబు నాయుడు కి ఉత్తరాలు రాసి పోస్ట్ చేశారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు దివి సౌభాగ్య, కందుకూరు పట్టణ మరియు మండల పార్టీల తెలుగు మహిళ అధ్యక్షులు ముచ్చు లక్ష్మీరాజ్యం, జొన్నల గడ్డ రమణమ్మ, సన్నెబోయిన ప్రభా వతి, మన్నం శైలజ, గురజాల ఆంతోనమ్మ, నెల్లూరు పార్లమెంటు మహిళా కమిటీ అధికార ప్రతినిధి బత్తిన ఆదెమ్మ, మహిళ నేతలు కల్లూరి శైలజ, సింగమనేని పద్మ, మర్రిబోయిన మాధవి, తోకల మాధవి, కంసాని మయూరి, షేక్ రసూల్ బి, ద్రాక్షా యణి, ఎస్తేరమ్మ, ఉన్నారు.

**పొదలకూరు :** టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు న్యాయం జరిగే వరకూ పోరు ఆగదని పొదలకూరు మండల టిడిపి శ్రేణులు స్పష్టం చేశారు. చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ ఆ పార్టీ నేతలు సోమ వారం స్థానిక టిడిపి కార్యాలయంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. బాబుతో నేను' పేరుతో నిర్వహించిన రిలే నిరాహార దీక్ష మండలంలోని ప్రతి గ్రామం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు వచ్చారు. నల్ల జెండాలు పట్టుకొని 'సైకో పోవాలి - సైకిల్ రావాలి', 'డౌన్ డౌన్ జగన్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు ,పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున నాయుడు ,రైతు సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి, మహిళా నాయకులు ఆదాల సుగుణమ్మ మాట్లాడారు. అధికార పార్టీ అరాచకాలను ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. టిడిపి నాయకులు రాష్ట్ర రైతు నాయకులు రావూరి రాధాకష్ణ నాయుడు, సర్వేపల్లి నియోజకవర్గ అబ్జర్వర్ దావా పెంచలరావు, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, రత్నం నాయుడు, అడపాల సుధాకర్ రెడ్డి, కర్రీయావుల శ్రీనివాసులు నాయుడు, హనుమారెడ్డి, కండే మస్తానయ్య, కష్ణ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బోగోలు భాస్కర్ రెడ్డి, పెంచల్ నాయుడు, చిరంజీవి నాయుడు, ఆశీర్వాదం, కొంగి మస్తానమ్మ, వెంపులూరు అరుణ, కొంగి వెంకటరమణయ్య, దేవినేని శరత్ నాయుడు, నారప నాయుడు ఉన్నారు.

**ప్రజాశక్తి-నెల్లూరు సిటీ :** మాజీ మంత్రి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును జైలు నుంచి త్వరగా విడుదల కావాలని ఆకాంక్షిస్తూ టిడిపి నాయకులు యాగం చేపట్టారు. నగరంలోని టిడిపి కార్యాల యంలో మాజీ మంత్రి పొంగూరు నారాయణ సూచనల మేరకు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనురాధ, విజేత రెడ్డి, భువనేశ్వరి, ప్రసాద్, మధు, సుబ్బారావు, ప్రశాంత్ కుమార్, శ్రీనివాసులు, అజయ్ రెడ్డి పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవ వేడుకల్లో యుటిఎఫ్ నాయకులు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రచార యాత్రకు పాల్గొనడానికి సోమవారం ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఎఎస్‌పేట మండలాల నుండి యుటిఎఫ్ నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీతో బయల్దేరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు శివప్రసాద్ రావు, హెచ్.మురళీకృష్ణ, ఎస్.మురళీకృష్ణ, ఎమ్‌డి నజీర్, మల్లికార్జున, సంగు మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ పేమెంట్‌పై శిక్షణ

**ప్రజాశక్తి-సీతారామపురం** : మండలంలోని అన్ని సచివాలయాలలో డిజిటల్ పేమెంట్ జరపడానికి పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరిగిందని ఎంపిడిఒ రంగ సుబ్బరాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి భార్గవి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## 'స్పందన'పై అధికారుల నిర్లక్ష్యం

**ప్రజాశక్తి-కావలి రూరల్** : మండల స్థాయి స్పందన కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అర్జీదారులు పేర్కొంటున్నారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమాన్ని చూస్తే కార్యక్రమం నిర్వహణ పరిస్థితి తెలుస్తుంది. మండల పరిధిలో దాదాపు 20కి పైగా ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. ఇందులో నాలుగు శాఖల అధికారులు మినహా ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు కానీ వారి ఇబ్బంది కానీ మధ్యాహ్నం 11 గంటల వరకు కార్యాలయానికి రాలేదు ఐసిడిఎస్, వెటర్నరీ, హార్టీ కల్చర్, మెప్మా శాఖలకు సంబంధించిన అధికారులు మినహా ఏ ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు కనిపించక పోవడం స్పందన కార్యక్రమంపై వారికి ఉన్న చిత్తశుద్ధిని ఏమిటో అర్థమవుతుందని ప్రజలు తెలియజేస్తున్నారు. పలువురు అధికారులు హాజరు కాకపోవడంతో అధికారులకు విధులపై నిర్లక్ష్యం తీరుపై అర్జీదారులు మండిపడుతున్నారు. మండల స్థాయి ప్రభుత్వ అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అర్జీదారులు కోరుతున్నామన్నారు.

## 'జగనన్నకు చెబుదాం..'

**ప్రజాశక్తి-సంగం** : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ గోపి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకొని వివరాల నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీహరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి రమేష్ పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీతకు సన్మానం

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : మండలంలోని వెన్నవాడ ఎంపిపిఎస్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలిశెట్టి రవీంద్ర కుమార్‌కు సెప్టెంబర్ 5 2023న నెల్లూరులో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును జెడ్‌పి చైర్మన్, జాయింట్ కలెక్టర్, ఎంఎల్‌సి చంద్రశేఖర్ రెడ్డి, డిఇఒపిసి సమగ్ర శిక్ష వారి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా ఆత్మకూరులోని తెలుగు భారతీయ సేవాసమితి ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆయనతో కలిసి మెలిసి విధులు నిర్వహించిన జి.రామ్ రెడ్డి, ఎ.రఘురామిరెడ్డి, ఆర్.మధు, గుణాత్మక విద్యను పెంపొందించడానికి ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షులు సోమవరపు సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి ఎపి వెంకటరెడ్డి, సహాధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి వమ్మిన సుబ్రహ్మణ్యం, సేవాసమితి ప్రతినిధులు ఎస్.వి.చలమయ్య, రమణయ్య, శేషారెడ్డి, నారాయణరావు, చంద్రశేఖర్, పెంచలరెడ్డి, మల్లికార్జున, కృష్ణయ్య, కాజారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## యువకుడి మృతి

**ప్రజాశక్తి-సీతారామపురం** : ఇరువురి తోపులాటలో కిందపడి ఒక యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని నారాయణమ్మపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నారాయణమ్మ పేట గ్రామానికి చెందిన మూఢమంచు వెంకటకృష్ణ (30) బంధువుల స్వల్ప వివాదంలోకి కలుగజేసుకోవడంతో ఒకరి ఒకరు తోసుకుంటున్న సందర్భంలో మృతుడు కాలుజారి కిందపడి తలకు తగలడంతో వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

## సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-కోవూరు** : పడుగుపాడు సహకార సొసైటీ రైతులకు అందిస్తున్న సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున రెడ్డి తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లోని సొసైటీ సమావేశ మందిరంలో సోమవారం మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని వేగూరు, పోతిరెడ్డి పాలెం, గంగవరం, చెర్లపాలెం గ్రామాల్లో ఒక్కొక్కటి 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 4 గోదాములు నిర్మాణం చేశామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సిఇఒ గోవర్ధన్ రెడ్డి, డైరెక్టర్లు అంబటి ప్రసాద్, గున్నం జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతహి సేవతో పర్యావరణ పరిరక్షణ

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం** : బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి ఆధ్వర్యంలో స్వచ్ఛతహి సేవ ర్యాలీ కార్యక్రమం జరిగింది. నగర పంచాయతీ సిబ్బంది పట్టణంలోని అంబేద్కర్ బొమ్మ వద్ద నుంచి ఈ ర్యాలీ ప్రారంభించారు. శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైసిపి నాయకులు కోడూరు మధుసూదన్ రెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్‌సి అగ్రిఫుడ్ టెక్నాలజీలో ప్రవేశాలు

**ప్రజాశక్తి-ఉదయగిరి** : ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని బిఎస్‌సి అగ్రి, బిటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల ప్రవేశాలకు వారికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు మొదటి వెబ్ ఆప్షన్స్ 27వ తేదీ నుండి 30వ తేదీ వరకు వినియోగించుకోవాలని యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. సీట్ పొందిన విద్యార్థులు అక్టోబరు 5 నుండి 7 వరకు సంబంధిత కళాశాలలో చేరవలసి ఉంటుందన్నారు.

## వర్గ విభేదాలతో అభివృద్ధి జరిగేనా..!

బాలగురవారెడ్డి

అలీ అహ్మద్

**ప్రజాశక్తి-వరికుంటపాడు** : అధికార పార్టీలోని వర్గ విభేదాలు రోజురోజుకి ముదిరి పాకన పడుతున్నాయి. ఏమైనా ప్రభుత్వ పథకాలు సంబంధించి మంజూరైతే ఒక వర్గం అవునంటే మరొక వర్గం కాదంటుంది. దాంతో ఏమి చేయలేక అధికారులు సైతం తలలు పట్టు కుంటున్నారు. ఈ తతంగమంతా మండలంలో స్పష్టంగా కనిపిస్తుంది. అర్హులకు పింఛను మంజూరు విషయంలో, అంగన్‌వాడీ ఆయా పోస్టుల విషయంలోనూ ఒక గ్రూపు అవునంటే మరొకవర్గం కాదనడంతో వారికి అందాల్సిన పథకాలు సైతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే విధంగా మారిపోయింది. తిమ్మారెడ్డిపల్లి ఆయాకు సంబంధిత శాఖ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఐదు నెలలు గడుస్తున్నా ఎంపిక చేసిన అభ్యర్థికి నియామక పత్రాలు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధికారులు మాత్రం అధికారుల పర్యవేక్షణలో ఉందని తప్పించుకుంటున్నారు. అధికారులు వర్గ విభేదాలతో రాజకీయ ఒత్తిళ్లతో పోస్టుకు మంగళం పాడేలా కనిపిస్తుంది. ఒక వర్గం ఒకరి పేరును చూపగా, మరొక వర్గం వేరొక పేరుని చూపింది. మొత్తం నలుగురు ఇంటర్వ్యూకు హాజరు అధికారులు మాత్రం ఎవరిని ఎంపిక చేయాలో తెలియక తికమక పడుతున్నారు. మండలంలో గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించాలన్న ఒక వర్గం వస్తే మరొక వర్గం దూరమవుతుంది. ఎంఎల్‌ఎపై ఖండనకు సంబంధించి కూడా ఒక వర్గం ఒకచోట, విలేకర్ల సమావేశం ఏర్పాటు చేస్తే మరొకవర్గం మరొక చోట విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. కనీసం ఎన్నికలు సమీపిస్తున్న ఈ వర్గ విభేదాలతో ఇరువర్గీయులు రైలు పట్టాల వలె కొనసాగుతున్నారు. ఓ వర్గానికి కన్వీనర్ ఆంద్రా బాల గురువారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా, మరొక వర్గానికి మాజీ ఎఎంసి చైర్మన్ అలీ అహ్మద్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ప్రభుత్వం నుంచి అధికార పార్టీలో వర్గ విభేదాలు లేకుండా అందరిని సమన్వయ పరచాలని సమన్వయకర్తలను నియమించినప్పటికీ అది మాత్రం ఇక్కడ బూడిదలో పోసిన పన్నీరు వలే మారింది. ఈ వర్గాలతో ఎవరికివారు స్వార్థంతో గుత్తేదారు అవతారం ఎత్తి ఓ నాయకుడు గండిపాలెం జలాశయంకు సంబంధించి కాలువ పనులు పూర్తి చేసినప్పటికీ చెరువుకు మాత్రం నీరు అందించిన దాఖలు లేవు. మరొక వర్గం నాయకుడు మాత్రం నీటి కొలను పేరుతో పనులు మంజూరు చేయించుకుని నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టి తూ.తూ. మంత్రంగా చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం రాజకీయ ఒత్తిళ్లతో అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దాంతో సామాన్య ప్రజలకు ఎటువైపు మొగ్గు చూపాలన్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనసాగుతుందా లేక పార్టీ అభివృద్ధికి కలిసి పని చేస్తారో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఎన్నికలలోపే మహిళా చట్టాన్ని అమలు చేయాలి

**ప్రజాశక్తి-కావలి**

స్థానిక తుఫాన్ నగర్‌లో ఉన్న 'జమాయతే ఇస్లామి హింద్ కార్యాలయంలో' "కావలి ఉమెన్ ఫోర్స్", జమాయతే ఇస్లామి హింద్ సంయుక్త ఆధ్వర్యంలో చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఇటీవల పార్లమెంటులో ఆమోదించబడిన చట్టాన్ని 2024 ఎన్నికల నుండే అమలు చేయాలని ఉమ్మడి తీర్మానంగా డిమాండ్ చేశారు. ఈ చర్చా వేదికకు ముఖ్య అతిథులుగా జమాయతే ఇస్లామి హింద్ రాష్ట్ర బాధ్యులు, ఫాతిమా కౌర్, జిల్లా బాధ్యురాలు, జహీదాబేగం పాల్గొని సందేశమిచ్చారు. వారు మాట్లాడుతూ

మాట్లాడుతున్న శారద

2029లో అమలవుతుందని కేంద్ర ప్రభుత్వం చెపుతున్న ఈ చట్టాన్ని హడావిడిగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనే ఏ ఉద్దేశంతో ఆమోదించారన్నారు. పైగా ముస్లిమ్ మైనారిటీలు, ఓబిసి - ఎస్‌సి, ఎస్‌టి, అల్పసంఖ్యాక వర్గాల స్త్రీలకు కూడా మహిళా రిజర్వేషన్ వర్తింపచేయాలని ఆమోదించే ముందు చెప్పకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద వర్ధన్ ప్రారంభించారు. 2029 వరకు వేచి ఉండవల్సిన అవసరం లేకుండా తాజాగా 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు జరపాలని తమ చర్చావేదిక డిమాండ్ చేస్తుందన్నారు. కావలి ఉమెన్ ఫోర్స్ కార్యవర్గ సభ్యులు ఫాతిమా, నూర్జహాన్, లక్ష్మి, రమాదేవి, ఉపాధ్యక్షురాలు టి.సుజాత, జమాయతే ఇస్లామి హింద్ సభ్యులు హుమారా, సమీరా, బుష్రా, పర్విన్, షకీలా చర్చలో పాల్గొన్నారు.

# సీతారామపురాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

**ప్రజాశక్తి-సీతారామపురం**

సీతారామపురం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బసినేనిపల్లి గ్రామంలో పలువురు రైతు నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. మర్రివూట్ల రిజర్వాయర్ దగ్గర నుండి మండలంలో ఉన్న అన్ని చెరువు కట్టలపై పెరిగిన చెట్లను తొలగించి చెరువు కట్టలను కాపాడాలన్నారు. జిల్లాలో ప్రధానంగా సిజెఎఫ్‌ఎస్ భూములను ప్రభుత్వ భూములుగా మార్చిన మండలం సీతారామపురం అని, అలాంటి లబ్ధిదారులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములను సాగుదారులకు హక్కులు కల్పించలన్నారు. మర్రివూట్ల రిజర్వాయర్, స్వామి చెరువు లీకేజీలను అరికట్టి కాలువలు రిపేర్ చేసి సాగు తాగునీరు కల్పించాలన్నారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ దక్షిణ కాలువ మీద లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సీతారామపురం మండలంలోని అన్ని చెరువులకు సాగునీరు

మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

ఇవ్వాలన్నారు. ప్రభుత్వం పంచిన పేద భూములలో ఉపాధి హామీ పనులు చేపించి భూమిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై అక్టోబర్ 3వ తేదీన బసినేనిపల్లి పంచాయతీ నుండి నెల్లూరు వరకు పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. కాబట్టి మండల ప్రజలందరూ పాదయాత్రను జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కల్లూరు వెంకటేశ్వర రెడ్డి, సిపిఎం నాయకులు కోడే రమణయ్య, రైతు నాయకులు బద్వేలు రమణా రెడ్డి, నారాయణరెడ్డి, కానాల హాజరత్తయ్య, రాజారత్నం, భైరవ, చిన్నపరెడ్డి, వెంకటేశ్వర్లు, చిన్న మౌలా సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి' పనులు పరిశీలన

**ప్రజాశక్తి-అనంతసాగరం** : మండలంలోని చెరువు కట్ట వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని మండలం ఉపాధి హామీ ఎపిఒ దయాసాగర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అన్వర్ భాషా మాట్లాడుతూ కొంతమందికి సక్రమంగా పేమెంట్ పడడం లేదని, మరో కొంతమందికి జాబ్‌కార్డులు లేక ఉపాధి హామీ పనికి రాలేక పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. అర్హులైన ప్రతివారికి జాబ్‌కార్డు మంజూరు చేయాలని, అలాగే ఉపాధి పనులు దగ్గర మెడికల్ కిట్లు పని ప్రదేశాలలో తప్పనిసరిగా ఉండాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం పోరాడి సాధించిన చట్టాన్ని, నేడు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ బడ్జెట్లో సరిపడినంత నిధులు కేటాయించడం లేదన్నారు. అరకొర నిధులతో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధి హామీ కూలీల పని దినాలను ఒక జాబ్ కార్డుకు 100 రోజుల నుండి 200 రోజులకు పెంచాలన్నారు. పనులు లేని కాలంలో చాలామందికి ఉపాధి పనులే ఆధారమవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు పెంచి, కూలీల కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా

# విద్యుత్ శాఖ ఏడీఈగా కోటేశ్వరరావు

**ప్రజాశక్తి-ఉదయగిరి** : ఉదయగిరి విద్యుత్‌శాఖ ఏడీఈగా డి.కోటేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారన్నారు. విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో విద్యుత్ వినియోగదారులు వ్యవసాయ రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## శంఖవరంలో 'కాకర్ల' ఉచిత సేవలు

**ప్రజాశక్తి-ఉదయగిరి**

కాకర్ల ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ సతీమణి లక్ష్మి ప్రవీణ సంజీవని ఆరోగ్య రథంతో అందుతున్న వైద్య సేవలను వారు పరిశీలించారు. సోమవారం వింజమూరు మండలం శంఖవరం మర్రిచెట్టు సెంటర్ వద్ద 125వ రోజు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ సంజీవని ఆరోగ్య రథంతో అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 124మందిని డాక్టర్లు వివిధ ఆరోగ్య సమస్యలు 81 మంది కంటి చూపు సమస్యలను మొత్తం 205 మంది చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం టిడిపి ట్రస్ట్ వ్యవస్థాపకులు వైద్య శిబిరాన్ని సందర్శించి ఎన్‌టిఆర్ సంజీవని ఆరోగ్య రథంతో అందిస్తున్న వైద్య సేవలను గ్రామస్తుల నుండి ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బోరెడ్డి హజరత్ రెడ్డి, బక్క పోలయ్య, బోరెడ్డి రమేష్ రెడ్డి, బోరెడ్డి కొండారెడ్డి, బోరెడ్డి పెంచల్ రెడ్డి, బోరెడ్డి దొరస్వామిరెడ్డి, చింతలబోయిన ప్రకాశం, లింగాలదిన్నె నారాయణ, బక్క బాలపెంచలయ్య, బక్క ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**ప్రజాశక్తి-నెల్లూరు**

98 డిఎస్‌సిలో మిగిలిన అభ్యర్థులకు సాధ్యమైనంత ఎక్కువ మందికి వీలైనంత త్వరగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎంఎల్‌సి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కోరారు. గుంటూరు జిల్లా వెలగపూడి శాసనమండలి సమావేశాలలో మూడవరోజు ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. 25 సంవత్సరాల నుంచి ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్న 98 డిఎస్‌సి అభ్యర్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట ఇస్తే నిలబెట్టుకుంటాడనే విధంగా ఉద్యోగాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 98 డిఎస్‌సిలో అర్హత సాధించిన 4070 మందికి సిఎ ఉద్యోగాలు కల్పించడమే కాకుండా వారం దరికీ మినిమం టైం స్కేల్ వర్తింపజేయడం అభినందనీయమని తెలిపారు. ఇది ఒక సాహసోపేతం నిర్ణయమని, ఉద్యోగాలు పొందిన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటారని తెలిపారు. 98 డిఎస్‌సిలో అర్హత సాధించి ఇంకా మిగిలి ఉన్న అందరికీ వీలైనంత త్వరగా ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## గిరిజనులకు అన్నదానం

**ప్రజాశక్తి-కావలి** : సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణం నివాసులు పి శ్రీధర్ 11వ వర్థంతి సందర్భంగా అయన సతీమణి శైలజ, కుమారుడు కుషాల్ జయంత్ కుమార్ బుడంగుంట గిరిజన ప్రాంతంలోని పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, నేటి దాతలు పి.శైలజ, పి.కుషాల్ జయంత్ కుమార్, సంస్థ సభ్యులు షేక్.షఫీ పాల్గొని అన్నదానం చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షు డు సురేంద్ర మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేసిన దాతలను అభినందించారు.

# మానవ అక్రమ రవాణాపై సదస్సు

**ప్రజాశక్తి-కావలి**

మూవ్‌మెంట్ ఇండియా సూచనల మేరకు సోమవారం ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షులు షేక్ ఖాదర్ బీ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల కావలిలో "మానవ అక్రమ రవాణా" పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో వక్తలు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. యువత మొదటి ప్రయారిటీ, నైతిక విలువల గురించి, బాల్యవివాహాలు, విద్య ప్రాముఖ్యతను, గురించి తల్లితండ్రుల, ముఖ్యపాత్ర, ఈ సమాజంలో ఆడపిల్లలు చదువుతోపాటు వాళ్లను వాళ్ళు రక్షించుకునే విధంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రవాణా, ప్రేమ పేరుతో, పెళ్లి పేరుతో, ఉద్యోగం పేరుతో, రకరకాలుగా, ప్రజలను ప్రలోభ పెట్టి, మానవ అక్రమ రవాణా చేయించడం, వారి నుండి అవయవాలను తీసుకోవడం, వారిని వ్యభిచార గృహాలకు అమ్మి సొమ్ము చేసుకోవడం జరుగుతుందన్నారు. ఆలా యువతి యువకులకు, అవగాహన కల్పించారు. యువత మార్గ దర్శకాలను

మాట్లాడుతున్న నాయకులు

చూసుకొని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తదుపరి మానవ అక్రమ రవాణాకు సంబంధించిన, ప్లే కార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య జూనియర్ కాలేజీ కరెస్పాండెంట్ ఎస్.వెంకయ్య, మట్టా కొండయ్య, స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా, వి.ఎం.ఎన్.ఆర్ మాల్యాద్రి, రాయపాటి దిలీప్ కుమార్, జమీర్, రఫీ అహమ్మద్, ప్రసాదరావు, అజిత్ బాబు, మహమ్మద్ అలీంబేగ్, బ్రహ్మయ్య, హరినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పొగాకు నియంత్రణపై అవగాహన

**ప్రజాశక్తి-మర్రిపాడు**

మండలంలోని డిసిపల్లి పొగాకు బోర్డు పరిధిలోని టీ ముస్తాపురం, డిసిపల్లి, నెల్లూరుపాలెం గ్రామాలలో పొగాకు నారుమళ్లను పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.లక్ష్మణ రావు పరిశీలించి రైతులకు తగు సూచనలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు పంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటలు ఆవశ్యకత గూర్చి వివరించారు. పొగాకు బోర్డ్ అనుమతించిన విస్తీర్ణం బ్యారెన్‌కు 2.9 హెక్టార్లలో 3650 కిలోల మాత్రమే పండించాలని సూచించారు. అధికంగా పొగాకు పంట పండించడం వల్ల డిమాండ్ తగ్గి సరైన ధరలు ఉండకపోవడంతో నష్టాలు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు మార్కెట్ ధరలు వివిధ దేశాలలో పొగాకు సాగు దిగుబడి నాణ్యత, అనేక అంతర్జాతీయ అంశాలు పొగాకు మార్కెట్ ధరలును ప్రభావితం చేస్తాయని తెలిపారు. పొగాకు విస్తరణను తగ్గించి దిగుబడి, నాణ్యతను పెంచుకొని అధిక లాభాలు పొందాలన్నారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవాలన్నారు. బ్యారెన్‌లను అధిక ధరలుకు కౌలుకు తీసుకుని

మాట్లాడుతున్న ఎం.లక్ష్మణరావు

పొగాకు పంట వేయడం వల్ల నష్టాలు వస్తాయని పెట్టుబడలు తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. పొగాకు బోర్డ్ అనుమతి లేకుండా కొత్త బ్యారెన్‌లు కట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రైతులు పచ్చిరొట్ట ఎరువులను పెంచడం వల్ల మంచి దిగుబడి, నాణమైన పొగాకు పండించవచ్చన్నారు. రైతులు పొగాకు బ్యారెన్‌లు రెన్యూవల్ చేసుకొని ఎరువులు ఇండెంట్ ఇచ్చిన వారు తగిన ధ్రువీకరణ పత్రాలు బోర్డుకు అందజేసి ఎరువులు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్, పొగాకు బోర్డ్ సిబ్బంది, ఐటిసి మేనేజర్ వెంకటేశ్వర రావు, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో అర్చన ప్రతిభ

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

మండలంలోని బట్టేపాడు హైస్కూల్‌కు చెందిన ఎ.అర్చన 9వ తరగతి విద్యార్థి రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో రజిత పథకం గెలుచుకుంది. ఈ సందర్భంగా పాఠశాలలో ఎ.అర్చనను హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయులు కె.వెంకటకృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. బట్టేపాడు హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఇటీవల నెల్లూరులో జరిగిన పోటీలలో గెలుపొంది రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ ముగ్గురు బాలికలు కృష్ణా జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో పాల్గొనగా అక్కడ ఎ.అర్చన 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మెరుగైన ఆటను ప్రదర్శించి రజిత పతకాన్ని (సిల్వర్ మెడల్) గెలుచుకుంది. పాఠశాల హెడ్మాస్టర్ ఈ.పెంచలయ్య ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తమ పాఠశాలకు పేరు తెచ్చేలా సిల్వర్ పతకం సాధించిన అర్చనను వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణయ్యను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు స్కూల్ ప్రాంగణంలోకి పూలు చల్లుతూ ఎంతో సంతోషంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఎపియుఎస్) ఆత్మకూరు అధ్యక్షులు పి.అనిల్ కుమార్ కూడా హాజరై అర్చనను అభినందించారు.

## కౌన్సిలర్ మృతిపై ఎంఎల్‌ఎ దిగ్భ్రాంతి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

ఆత్మకూరు మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి ఆకస్మికంగా మృతి చెందడంతో సమాచారం తెలుసుకున్న ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శాసనసభా సమావేశాల్లో ఉన్న ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి భర్త వైసిపి నాయకులు కొండా వెంకటేశ్వర్లుకు ఫోన్ ద్వారా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. వార్డు కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి మృతి చాలా బాధాకరమని, కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని ఎంఎల్‌ఎ పేర్కొన్నారు.

## థర్డ్ పార్టీ విధానం రద్దు చేయాలి

**ప్రజాశక్తి-బిట్రగుంట**

సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో మీటర్ రీడర్స్ వారికి థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన మాట నెరవేర్చుకోవాలని జిల్లా మీటర్స్ రీడర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బత్తుల రవిచంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం బోగోలు సెంటర్లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మీటర్స్ లీడర్స్ సభ్యులు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## జెడ్‌పి చైర్మన్‌ను కలిసిన ఎంపిపి

**ప్రజాశక్తి-దగదర్తి**

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపిపి

జెడ్‌పి చైర్మన్ ఆనం అరుణమ్మను సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో దగదర్తి ఎంపిపి తాళ్లూరు వెంకటప్రసాద్ నాయుడు, పోలీస్ హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ అనిల్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యక్షులుగా ఎన్నికై రెండు సంవత్సర పూర్తి చేసిన సందర్భంగా అభినందనలు తెలిపామన్నారు. అధ్యక్షురాలు ఎన్నికైన కానించి జిల్లాను అభివృద్ధి పథంలో నిరూపిస్తున్న కొనియాడారు. అభివృద్ధి చేసేందుకు జెడ్‌పిటిసి నిధుల మంజూరు చేయడంతో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

## గ్రంథాలయ బకాయిలు చెల్లించాలి

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

మండల పరిధిలోని 21 గ్రామపంచాయతీల నుండి జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన లైబ్రరీ సెస్ బకాయిల చెల్లించాలని సోమవారం ఆత్మకూరు లైబ్రరియన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరాజు ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్, ఇఒపిఆర్‌డి ఉషారాణిలను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన లైబ్రరీ సెస్ బకాయిలు సక్రమంగా చెల్లింపులు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

# కొనసాగుతున్న టిడిపి దీక్షలు

**ప్రజాశక్తి-కావలి**

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల నిర్మాత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రానున్న ఎన్నికల్లో అవినీతిపరుడు, జగన్‌మోహన్ రెడ్డి వైసిపి ప్రభుత్వం కొట్టుకు పోవడం ఖాయమని మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా, కావలి నియోజకవర్గ టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలోని రైతు సంఘం నేతలు, తెలుగు రైతు విభాగం సభ్యులు, టిడిపి కుటుంబ సభ్యులతో సోమవారం 12వ రోజు రిలే నిరాహార దీక్షలు టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బా నాయుడు ఆధ్వర్యంలో జరిగాయి. దీక్షలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో రైతులకు జరుగుతున్న అన్యాయాలపై తమ గళం వినిపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రైతుల ఆత్మహత్యల్లో దేశంలో మొదటి స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో కొనసాగుతుండటం బాధాకరమన్నారు. రైతు భరోసా కేంద్రాల పేరుతో ఆర్భాటమే తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదని, అన్ని విధాలా రైతులను అంధకారంలోకి నెట్టిన ఏకైక ప్రభుత్వం ఈ వైసిపి ప్రభుత్వమని ధ్వజమెత్తారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బా నాయుడు మాట్లాడుతూ ఈరోజుటికీ చంద్రబాబు నాయుడుని 17 రోజులుగా జైలులో ఉంచారని, తాము 12 రోజులుగా శాంతియుతంగా ఈ రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నామన్నారు. కనీసం ఆయనకు జైలులో మంచి వసతులు కూడా కల్పించకుండా కక్ష సాధింపుతోనే ఈ ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమంలో అర్హత పొంది లక్షల మంది ఈరోజు ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. రాబోయే 2024 ఎన్నికల్లో టిడిపిని అఖండ మెజారిటీతో గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతిఒక్క పౌరుడు చైతన్యవంతం కావాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తుతో పాటు మన బిడ్డల బంగారు భవిష్యత్ కోసం చంద్రబాబు నాయుడిని సిఎంగా చేసుకోవాలని కోరారు. కావలి నియోజకవర్గం నుండి ఈ రిలే నిరాహార దీక్షకు భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతు కుటుంబాలకు, సోదర, సోదరీ మణులకు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాలేపాటి నాగేశ్వరరావు, సురేంద్ర, బాచి రవియాదవ్, ఆముదాలదిన్నె శ్రీను, మహిళా రైతులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కలిగిరి** : 2024 ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఏ శక్తులు ఆపలేవని ఉదయగిరి మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకట రామారావు తెలిపారు. కలిగిరి పార్టీ కార్యాలయం ఎదుట గత కొద్ది రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని భూస్థాపితం చేయాలని వైసిపి కలలు కంటుందని ఆ కలలు నెరవేరవన్నారు. పార్టీలకతీతంగా చంద్రబాబు అక్రమ అరెస్టుపై రాష్ట్రవ్యాప్తంగా రగిలిపోతున్నారని రామారావు తెలిపారు. కార్యక్రమంలో కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం వెంకట కృష్ణారెడ్డి, కార్యదర్శి కాకు మహేష్, దంతులూరి వెంకటేశ్వర్లు, గురుజాల వాసు, కోడూరు నాగిరెడ్డి, గూడా నర్సారెడ్డి, బి.రామారావు, గురజాల వెంకటరమణయ్య, గంజాం రాఘవేంద్ర, లెక్కల రాంబాబు, మాదాల శ్రీనివాసులు కిలారికొండపు నాయుడు, బొగ్గవరపు వేణు, సిహెచ్ జయరామిరెడ్డి, తాతయ్య, కట్టా వెంకటేశ్వర్లు, ఓ.మాల్యాద్రి, గణపురం సుదర్శన్, కల్లూరి చంద్రమౌళి, ఎంఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-సీతారామపురం** : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ఉండి మచ్చలేని నాయకుడిగా త్వరగా జైలు నుండి విడుదల కావాలంటూ ప్రముఖ శైవ క్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరంలో సోమవారం మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని రామారావు, మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచలబాబు యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ రామారావు మాట్లాడుతూ చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు నిలబడవని వైసిపికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు అరెస్టుపై రాష్ట్ర ప్రజలంతా తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. చంద్రబాబు జైలు నుండి వెంటనే విడుదల కావాలని ప్రపంచంలోనే తెలుగు ప్రజలందరూ ముక్తకంఠంతో కోరుతున్నారన్నారు. ప్రజల సొమ్మును కాజేయాల్సిన అవసరం చంద్రబాబు నాయుడుకు లేదని అధికారం ఉన్న లేకపోయినా రోజుకి 18 గంటల పాటు ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల కోసం పనిచేసే ఏకైక నాయకుడు చంద్రబాబు అని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు, సీనియర్ నాయకులు చంద్ర రెడ్డి, సింగాల నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జాషువా చెన్నకేశవులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమంగా అరెస్ట్ నుంచి విముక్తి కలగాలని సోమవారం పట్టణంలోని శివాలయంలో టిడిపి శ్రేణులు పూజలు చేశారు. జగన్ అరాచక పాలనకు త్వరలో ప్రజలు ముగింపు పలకతారని టిడిపి నాయకులు తెలిపారు. చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన సిఎం జగన్ రాష్ట్ర ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పులిమి శైలజా రెడ్డి, పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు సుంకర పెంచలయ్య చౌదరి, కేత విజయభాస్కర్ రెడ్డి, చంద్రా వెంకట సుబ్బానాయుడు, పిటికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మద్దినేని నారాయణ తోడేటి వెంకటయ్య, మీరా మొహిదీన్, నాగభూషణమ్మ, తదితరులున్నారు.

**ప్రజాశక్తి-బిట్రగుంట : టిడిపి** జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజాయితీకి అండగా పోరాటం చేస్తామని పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా చెంచులక్ష్మిపురం గ్రామం నుండి బోగోలు బజారు సెంటర్ అంబేద్కర్ కూడలి వరకు భారీ ర్యాలీని పిఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయాలని, రాజశేఖర్ రెడ్డి రాజ్యాంగాన్ని నిర్మూలించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు అయినా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే వైసిపికి తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు పసుపులేటి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, జగదీష్, కిషోర్, ప్రసాద్, సురేష్, మామిడి వెంకటేశ్వర్లు, ప్రత్యూష, నరేంద్ర, మస్తాన్, మండలంలోని నాయకులు పాల్గొన్నారు.